# మనసు పొరల్లో

- కూర్మాన వెంకట సుబ్బారావు

ఇంట్లో అడుగుపెట్టేసరికి సోఫాలో ఏదో ఆలోచిస్తూ ఎటో పిచ్చి చూపులు చూస్తున్న శ్రీధర్ కనిపించాడు.

శ్రీధర్ వేసిన పెయింటింగ్స్ అస్తవ్యస్తంగా పడున్నాయి. కొన్ని పూర్తిచేసినవి, కొన్ని అవుట్‌లైన్ డ్రా చేసినవి, మరికొన్ని సగం పూర్తి చేసుకొని ముందున్న టేబుల్‌ని ఆక్రమించుకున్నాయి.

శ్రీధర్ చిత్రం గీసి పెయింటింగ్ పూర్తి చేసి మొదటిసారి నాకే చూపించి ఏవైనా లోపాలుంటే చెప్పమంటాడు. నేను చెబితే వాడికో తృప్తి. నా కామెంట్‌ని వాడు ఎంతో ఆనందంగా స్వీకరిస్తాడు.

వాటిమీద నాకు పూర్తి అవగాహన లేకపోయినా ఒక సామాన్య ప్రేక్షకునిగా నేనిచ్చే తీర్పు వాడి అంతరంగాన్ని సంతోషంతో నింపుతుంది.

గత కొన్నేళ్లగా రచనా వ్యాసంగం, చిత్రలేఖనం ఈ రెండింట్లో కృషి చేస్తున్నాడు. రాను రాను రచనా వ్యాసాంగానికి స్వస్తి చెప్పి చిత్రలేఖనం, పెయింటింగ్ మీదనే మనసు కేంద్రీకరిస్తున్నాడు. ఈ మధ్య వాడి మనసు బొత్తిగా బావుండడం లేదు.

వాడి ప్రతిచర్య అసంకల్పితంగానే ఉంటోంది.

ఏదో నిరాశ, నిస్పృహ వాడ్ని కృంగదీస్తున్నాయి.

మా ఆఫీసులో ఏటా నిర్వహించే చిత్రలేఖనం పోటీ ఈ ఏడుకూడా అనౌన్స్ చేశారు. శ్రీధర్ పాల్గొంటే ఒక అవార్డు గ్యారంటీ....

అసలు పోటీలో పాల్గొంటాడో లేదో, పాల్గొంటే ఏ కొత్త బొమ్మ వేయబోతున్నాడో తెలుసుకుందామని వీక్లీ ఆఫ్ నాడు వెళ్ళాను.

నేను వెళ్లిన పదినిముషాలకు గాని ఇహంలోకి ఊడిపడలేదు.

పది నిముషాల తర్వాత "ఏరా! ఎంత సేపయ్యింది వచ్చి?" అన్నాడు.

"ఇప్పుడే" అన్నాను.

పిచ్చాపాటీ మాట్లాడుకున్న తర్వాత "పోటీకి ఏ బొమ్మ గీస్తున్నావ్?" అడిగాన్నేను.

రెండు మూడు అవుట్‌లైన్స్ గీసిన షీట్స్ చూపించి నిరుత్సాహంగా తలవేలాడేసి "నాకీసారి పాల్గొనాలనిలేదు" క్షణంలో మనసు మార్చుకున్నట్లుగా అన్నాడు.

"అదేవిటి. నువ్వు పాల్గొంటే ఒక ప్రైజ్ గ్యారంటీ కదా".



"కరెక్టే.... ఇంట్లో ఎంకరేజ్‌మెంట్ లేదు. నా ఇంట్లోనే నా ఆర్టు మీద చిన్న చూపు... మరి ఎవరికోసం నేను కృషి చెయ్యాలి."

వాడి మాటల్లో చెప్పలేనంత అసహనం తొంగిచూసింది. ఆ విషయం నాకు తెలియంది కాదు. శ్రీధర్ భార్య గీతకి శ్రీధర్ ఏక్టివిటీస్ నచ్చవు. ఆ విషయంలో ఆమె కోపరేషన్ శూన్యం.

'వెనకనుండి భర్తను నడిపించ వలసిన భార్య అనుక్షణం అతన్ని దుయ్యబడుతుంటే కళల మీద మమకారం ఉన్న వ్యక్తి పరిస్థితి ఏమిటి?" తర్కించుకున్నాను.

కాస్సేపటికి శ్రీధర్ భార్య గీత బిస్కట్ల ప్లేటు,

టీతో "ఎంత సేపైంది అన్నయ్యగారూ?" అంటూ వచ్చింది.

"ఓ పావుగంట" అన్నాను.

"కాస్త నిద్ర పట్టేసింది.... మీరు రావడం తెలీదు" అని ఒక్క నిముషం నిలబడి లోపలికి వెళ్లింది.

"రాత్రంతా మొగుడ్ని సాధించుకుతింటుంటే నిద్రెలా పడుతుంది" ఆమె నిష్క్రమణ తర్వాత శ్రీధర్ నోటినుండి మాటలు వెలువడ్డాయి.

"ఊరుకోరా".

"లేకపోతే ఏంట్రా... రోజురోజుకి ఈ ఇల్లొక నరకకూపంలా తయారవుతోంది".

"ఒరేయ్! హోల్డ్ యువర్ టంగ్.... ప్లీజ్! సిస్టర్ వింటే రభస జరుగుతుంది.... పద... అలా బ్రిడ్జి మీదకు షికారుకి వెళ్దాం" వాడ్ని కదిలించాను.

పది నిమిషాల్లో గోధుమరంగు సఫారీలో ప్రత్యక్షమయ్యాడు.

గోడమీద ఫోటో ఫ్రేములో వాడేసిన వాడి బొమ్మలా అందంగా తయారయ్యాడు.

మనిషి ఫోటో దగ్గర పెట్టుకొని గంటలో బొమ్మగీసే నైపుణ్యం వాడికి ఉంది.

"అమ్మా! గీతా, వస్తాను" అంటూ వాడ్ని తీసుకొని బైటకు నడిచాను.

సాయంత్రం నేనెప్పుడు వాళ్లింటికి వెళ్లినా ఇద్దరం కలిసి దగ్గరలో ఉన్న ఫ్లై వోవర్ బ్రిడ్జి మీద ఒక గంట గడుపుతాం.

ఒక్కోరోజు ఏదసపల్లాకో, గ్రీన్ పార్క్‌కో డిన్నర్‌కి వెడుతుంటాం. నేను కలిస్తే చాలు... ఆ రోజు స్పెషల్‌గా ఎంజాయ్ చేయాలని ఇంట్లో భోజనానికి స్వస్తి చెప్పి హోటల్‌కి తీసుకుపోతాడు.

కాస్సేపు బ్రిడ్జి మీద గడిపిన తర్వాత "ఈ రోజైనా హోటల్లో భోంచేద్దాం..." అని ప్రతిపాదన చేశాడు.

మరోరోజైతే తిరస్కరించే వాడినే.... కానీ ఆ రోజు మాత్రం శ్రీధర్ మూడాఫ్ నుండి 'ప్రశాంత పర్వం' లోకి వస్తున్నాడు. వెంటనే 'ఓ.కె.' చేశాను.

వాడి మాటల బట్టి వాడిలో పేరుకుపోతున్న నిరుత్సాహం, అసహనానికి గల కారణం అవగతమైంది.

ఇంటిలో వాడు ఫీలవుతున్న భయంకర వాతావరణం నుండి వాడ్ని బయటకు తీసుకు రాగలిగాను.

"నా అయామ్ వెరీ హేపీ. దేవుడు పంపించినట్టు నువ్వే వచ్చావు. నీ సమక్షంలో నా మనసు దూదిపింజలా హాయిగా ఎగిరిపోతుంది" అన్నాడు.

నన్ను గురించిన ఇలాంటి పదజాలం ఎన్నోసార్లు వాడి నోటి నుండి విన్నాను. అందుకే నా షెడ్యూల్లో నెలలో ఓ నాలుగుసార్లు వాడి ఇంటికి వెళ్లాల్సిందే. కంపల్సరీగా అక్కడ ఏదో ఒకటి తినాల్సిందే... సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంటి ముఖం పట్టాం.

మరుసటి రోజు శ్రీధర్ ఇంటికి వెళ్లాను.

"రండన్నయ్యా!" అంటూ చెల్లాయి గీత లోపలికి ఆహ్వానించింది.

ఒక గంటలో బైటకు వెళ్లి వస్తానని శ్రీధర్ చెప్పినట్లు ఆమె చెప్పింది.

మంచినీళ్లు తాగి సేదతీరిన తర్వాత....

"ఒక్క అయిదునిముషాలు మీకుటుంబ వ్యవహారాల్లో తలదూరుస్తాను. నన్ను తప్పుగా అర్థం చేసుకోవుకదూ..." నా గొంతులో ప్రశాంతత సంతరించుకుంది.

"ఫర్వాలేదు చెప్పండన్నయ్యా..." గీత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

"అమ్మా గీతా..... శ్రీధర్ ఒక గొప్ప ఆర్టిస్టమ్మా... నీకు తెలుసో లేదో నేను స్నేహం చెయ్యడానికి ప్రధాన కారణం. వాడిలోని కళను చూసేనమ్మా. బొమ్మలు గీయడం సామాన్యమైన కళ కాదు. అది పూర్వజన్మ సుకృతం. అది అందరికీ అంతు చిక్కేది కాదు. ఒక సాహితీ వ్యాసాంగం, ఒక కళ, ఒక డ్యాన్సు ఇవన్నీ మనిషికి భగవంతుడిచ్చిన వరాలు. అవి పూర్వజన్మ సుకృతం వల్ల లభించేవి. దయచేసి శ్రీధర్ మంచి ఆర్టిస్టుగా రూపుదిద్దుకోడానికి నీ సంపూర్ణ సహకారం అందించాలమ్మా."

"అన్నయ్యా! ఇంత జరిగాక నా మనసులో మాట చెప్పకుండా ఉండలేను. ఈ కళ ఎంత గొప్పదైనప్పటికీ అది మా పాలిట శాపం అవుతోంది. ఆయన పరిస్థితి.... ఈ ఇంటి ఆర్థిక పరిస్థితి మీకు తెలియదన్నయ్యా.... తోటి వాళ్లంతా ఉద్యోగాలు చేసి ఇల్లు, వాకిళ్లూ సమకూర్చుకుంటుంటే ఈయన అప్పుల్లో మునిగి మమ్మల్ని ముంచేస్తున్నారు. ఈనాటికి ఇన్ని సంవత్సరాల ఉద్యోగం తర్వాత నా మెడలో మిగిలింది ఈ ఒక్క పుస్తె మాత్రమే... పిల్లలు ఎదుగుతున్నారు.

అన్నయ్యా..... నాకు తెలిసిన నిజం ఒకటుంది.... ఏ కళాకారుడి ఇల్లు భోగభోగ్యాలతో ఉండదు. అందుకే ఈ దిక్కుమాలిన వ్యాపకం నుండి బైటపడమంటున్నాను".

ఆమెలో రగులుతున్న రాంగ్ కాన్సెప్ట్ నాకర్థమైంది.

ఆమె స్టాండర్డ్‌కి అంతకంటే గొప్ప ఆలోచనలు వస్తాయనుకుంటే అది పొరపాటే అవుతుంది.

గిరిగీసుకున్న పక్కా మధ్యతరగతి మనస్తత్వం.

తరతరాలుగా, ఎవరో, ఎప్పుడో మాట్లాడుకున్న మాటల పల్లవులు 'మనసు పొరల్లో' నాటుకున్నాయి. 'కళాకారుడి బతుకు ఒక నరకం' ఆమె ఒక సగటు మనిషి...

ఎదిగీ ఎదగని మనస్తత్వం...

ఆమె అచేతనత్వంనుండి బైట పడడానికి నా కన్విన్సింగ్ శక్తి చాలదనిపించింది.

మరో కొత్త రకం కౌన్సిలింగ్‌తో మరుగు జ్జులాంటి ఆమె మానసిక స్థితిలో మార్పు తీసుకురావాలి.

ఈ ద్వైదీభావ మనస్తత్వాలనుండి వాళ్లిద్దర్నీ ఒకటి చేసే మరో బృహత్తర ప్రణాళిక కోసం నావేట సాగింది. ❀


సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక, విజ్ఞానాత్మక నవలా రచయితగా పాఠకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న

సుప్రసిద్ధ నవలా రచయిత

**విశ్వప్రసాద్**

అద్భుత అపూర్వ సృష్టి

**ప్రేమ పిపాసి**

సైన్స్ ఫిక్షన్ సీరియల్

పైవారమే ప్రారంభం